సాయి మాలిక్‌కు అంబేడ్కర్ ఉత్తమ సామాజిక పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న పెండ్యాల సాయి మాలిక్

రాజేంద్రనగర్: జంట నగరాల ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్తమ సామాజిక పురస్కారానికి బుద్వేల్ ప్రాంతానికి చెందిన శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్యాల సాయి మాలిక్ ఎంపికయ్యారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో గాయని పూర్ణిమ శ్రేష్ఠ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుద్వేల్‌లోని కార్యాలయంలో సాయి మాలిక్ మాట్లాడుతూ... శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక క్యాక్రమాలను గుర్తించి అవార్డును ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

100 శాతం.. చెత్త సేకరణే లక్ష్యం!

ఐటీ కారిడార్‌లో స్వచ్ఛ ఆటోల సంఖ్య పెంపు దిశగా చర్యలు



రోడ్లను ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



జీవీపీ పాయింట్‌లో చెత్తను తొలగిస్తున్న ఆటో కార్మికులు

- ఆటోలకు జియో రూట్ మ్యాపింగ్
- 15 రోజుల్లో జీవీపీల తొలగింపు

గచ్చిబౌలి: చెత్త రహిత కాలనీలు, బస్తీలు మార్చేందుకు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి నేతృత్వంలో పక్కా ప్రణాళిక రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని యూసూఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిళ్లలో పారిశుద్ధ్యం పకడ్బందిగా నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. ఇళ్లు, షాపుల నుంచి వచ్చే చెత్తను పారబోయక ముందే సేకరించాలని లక్ష్యంతో పని చేస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాటు త్వరలో కానున్నాయని కమిషనర్ వెల్లడించారు.

పని విభజనతో..

ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఊడ్చడం, చెత్త సేకరించేందుకు 2 కిలో మీటర్లకు ఒక గ్రూపు, ఎస్ఎఫ్ఏను నియమించనున్నారు. రోడ్లను వూడ్చే సిబ్బంది ఒకేచోట గుంపులుగా ఉండి పని చేయడం నిత్యం కనిపిస్తుంటుంది. ఇప్పుడిలా కాకుండా పని విభజన చేయనున్నారు. 500 మీటర్లకు ఒక సిబ్బందిని నియమిస్తారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు ఎక్కువగా ఉండటం, చెత్త ఎక్కువ వచ్చే ప్రాంతమైతే దూరం తగ్గిస్తారు. కేటాయించిన ప్రాంతంలోనే సిబ్బంది, గ్రూపు పని చేయాల్సి ఉంటుంది. షాపుల ముందు డబ్బాలు పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, చర్యలు విధిస్తారు. 500 ఇళ్లకు ఒక స్వచ్ఛ ఆటో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

163 జీవీపీ పాయింట్ల తొలగింపు..

ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో వెయ్యి, రెండు వేల ఇళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో చెత్త సేకరణ సరిగ్గా లేకపోవడంతో ఖాళీ ప్రదేశాలలో డంప్ చేస్తున్నారు. 500 ఇళ్ల టార్గెట్‌గా ఆటోల సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఆటోవాలాలకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్‌తో పాటు జియో మ్యాపింగ్ చేయనున్నారు. స్వచ్ఛ ఆటో ఆ రూట్‌లో ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరించే విధంగా సంబంధిత సిబ్బంది, అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వారం రోజుల్లో రోడ్ల వెంట పొదలు, గడ్డి, మట్టిని దాదాపు 155 కిలో మీటర్ల పొడవునా తొలగించారు. 163 జీవీపీ పాయింట్లను(చెత్త పడేసే) తొలగించారు. 85 కమ్యూనిటీ హాళ్లు, 80 విద్యా సంస్థలను శుభ్రం చేశారు. 10 రైల్వే ట్రాక్‌లు, 55 వీక్లీ మార్కెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం..



మల్టీ నేషన్ కంపెనీలకు నిలయంగా ఉన్న శేరిలింగంపల్లిలోని ఐటీ కారిడార్‌కు ఎంతో మంది విదేశీలు, ప్రముఖులు వస్తుంటారు. ప్రధాన రహదారులు, మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, కాలనీలు పరిశుభ్రంగా ఉంటేనే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇండోర్, భోపాల్ సిటీలో పారిశుద్ధ్య మెరుగుగా నిర్వహించడానికి అక్కడి ప్రజల చైతన్యం కారణంగా చెప్పవచ్చు. సిబ్బందికి పని విభజన, ప్రజల భాగస్వామ్యంతో గతంలో ఎన్నడు లేని విధంగా పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాం. ఐటీ కారిడార్‌ను రోల్‌మోడల్‌గా తీర్చి దిద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం. -పి.ఉపేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి

నేడు ప్రజావాణి కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ రవి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కారం పొందాలని సూచించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్: రాష్ట్రంలోని సరస్వతీ విద్యాపీఠం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శివరాంపల్లిలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి శిశు మందిర్ విద్యా సంస్థల అకాడమిక్ ఇన్‌చార్జి సాంబశివ రావు, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ గంగాధర్ ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ శిక్షణలో 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించాల్సిన పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న కాలనీ మహిళలు

బండ్లగూడ: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని మహిళా నాయకురాలు శివజ్యోతి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, అభ్యుదయనగర్ కాలనీలో ఆదివారం కొందరు మహిళలు తమ ఇళ్లల్లో పెంచిన పూల, పండ్ల మొక్కలను కాలనీ వాసులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివజ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి పెంపకంపై బాధ్యతలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా కాలనీలలో పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కలిసి మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్జహాన్, అలువేలు, సద్గుణ, అరుణ, రత్నమ్మ, స్వరూప, పద్మా తదితరులు పాల్గొన్నారు.

హిందువులను కాపాడండి

మణికొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపైన దాడులు, అత్యాచారాలు, దోపిడీలు, హత్యలను వెంటనే నిలిపివేయాలని లేని పక్షంలో పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం రాత్రి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ, స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో హిందువులపై దాడులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ సురేష్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఇప్పటికే ప్రధాన మంత్రి రాజీనామా చేసిందన్నారు. అయినా శాంతించకుండా హిందువులను టార్గెట్‌గా చేసుకుని దాడులకు పాల్పడటం దారుణమన్నారురు. ఇకనైనా దాడులను ఆపకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు

గచ్చిబౌలి స్టేడియంలో సంబురాలు

గచ్చిబౌలి: భారత హాకీ జట్టు ఒలింపిక్‌లో కాంస్య పతకం సాధించడంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. శనివారం స్టేడియంలో జూనియర్ జాతీయ జట్టు ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా విజయ్ మాట్లాడుతూ.. హాకీలో కాంస్య పతకం రావడం రెట్టింపు ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యదర్శి భీమ్ సింగ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 నుంచి 18 వరకు జలంధర్‌లో హాకీ జూనియర్ జాతీయ పోటీలు జరుగుతాయన్నారు. వేణు గోపాల్, సురేందర్ సింగ్, హుస్సేన్, బీన్ మహ్మద్ పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



వెంకటేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సబితా ఇంద్రారెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ కురుమ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సాయిబాబాచారికి సన్మానం

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా బి.సాయిబాబాచారి ఎంతగానో విశేష కృషి చేశారని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ శ్రీనివాసరాజ్ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలోని ఆలయ ప్రాంగణంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాయిబాబాచారి పట్టుదల, వృత్తి పనివారి హక్కుల పట్ల నిబద్ధత చూపించారన్నారు. వృత్తిపనివారికి సాయిబాబచారి మార్గదర్శకుడిగా ఉంటూ వచ్చారని ఆయన ప్రశంసించారు.

సౌండ్ తగ్గించమన్నందుకు కుర్చితో దాడి

గచ్చిబౌలి: చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని పాటల సౌండ్ ఆపాలని కోరినందుకు ఓ వ్యక్తి కుర్చీతో దాడి చేసిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీష్ వివరాల ప్రకారం.. ఖాజాగూడలోని లలిత బ్లూమ్‌ఫీల్డ్ విల్లాస్‌లో 16 నెంబర్ విల్లాలో సూర్య అనే వ్యక్తి నివాసముంటున్నాడు. విల్లా నెంబర్ 6లో ఉంటున్న రాజేంద్రన్ ప్రతి రోజూ పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెడుతున్నాడు. పాటల శబ్దాలతో చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని సూర్య, అతని కొడుకు రాజేంద్రన్ విల్లాలోకి వెళ్లగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాజేంద్రన్ కుర్చీతో సూర్యపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



దేవాలయాల నిర్మాణానికి పూజలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలోని పోచమ్మ, ఎల్లమ్మ, మల్లన్న, బీరప్ప దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవాలయాల అభివృద్ధిపై చర్చించటంతో పాటు వాటి అభివృద్ధి పనులకు అంచనాలను సిద్ధం చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు దేవాలయాలు ఎంతో అవసరం అన్నారు. వాటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు కలిసి కట్టుగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎం. ప్రవీణ్‌యాదవ్, పి. సంజీవరెడ్డి, కళమ్మ ముత్యాలు, మాజీ ఎంపీటీసీ ఈశ్వరయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, అర్చకులు వరదాచార్యులు, కన్నయ్యాచార్యులుతో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



సాయిపాదుకల పూజల్లో ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, లావతి

లంగర్‌హౌస్: సాయినాథుని నామస్మరణతో లంగర్‌హౌస్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో మారుమ్రోగాయి. సాయిటెక్ పెయింట్ అధినేత దివంగత ముత్యాల కృష్ణ స్వగృహంలో సాయిబాబా ఆలయం నిర్మించి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఆలయ నిర్మించిన రోజున షిరిడీ నుంచి స్వయంగా సాయిబాబా వేసుకున్న పాదుకలు, ఆయన వస్త్రాలను ఇక్కడకు తీసుకురావడం ఆనవాయితి. ఇందులో భాగంగా సాయిటెక్ కృష్ణ కుమారుడు ముత్యాల శేఖర్‌బాబు, సుమలత దంపతులు సాయిబాబా పాదుకలు, బాబా ధరించిన కఫిని వస్త్రం తీసుకువచ్చారు. ఈ పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబా పాదుకలు, వస్త్రాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల లీలావతి, గణసాయి, సాయిచరణ్, మౌనిక పాల్గొన్నారు.

గోల్కొండలో 10కే రన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

గోల్కొండ: గోల్కొండ కోట వద్ద కేఎస్ఆర్ సైక్లింగ్ నాగరాజు ఆధ్వర్యంలో తెలంగాణ హిస్టారికల్ 10కే రన్, రైడ్ జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన భాష మన హక్కు అని, మన వనరుల సంపద మనకు ముందుబాట అని అన్నారు. మన తెలంగాణలో చారిత్రక కళా ఖండాలు, కట్టడాలు ఎన్నో ఉన్నాయన్నారు. మన సంస్కృతి, ఆత్మగౌరవం ఎందరో మహానుభావుల త్యాగ నీరతికి స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఉటోపియా సాయికిరణ్, వందే మాతం ఫౌండేషన్ మాధవరెడ్డి, మేకలస్ వెంటురేస్ భరత్, టీకే రైడ్ టీం రఘు, శ్రీనివాస్, వాక్‌ఫిట్‌కు చెందిన మాధవి, రవీందర్, యశోద ఆసుపత్రి టీం, సిటీ పోలీస్ టీం, జీహెచ్ఎంసీ టీం పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఉప్పల శ్రీనివాస్ గుప్తా బహుమతులు అందజేశారు.

రౌడీ షీటర్ వీరంగం

మహిళలపై దాడి చేసి నగదు, బంగారం లాక్కెళ్లిన వైనం



రౌడీ షీటర్ దాడిలో గాయపడిన యువకుడు



నిందితుడు యూసుఫ్

అత్తాపూర్: రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో జోక్యం చేసుకున్న ఓ రౌడీ షీటర్ తన అనుచరులతో కలిసి వీరంగం సృష్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట రామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన రెండు కుటుంబాల మధ్య గొడవజరిగింది. దీంతో ఓ కుటుంబం తరపున మాట్లాడేందుకు యూసుఫ్ అనే రౌడీ షీటర్ అక్కడికి వచ్చాడు. దీంతో ఇరు వర్గాల మధ్యన మాటామాట పెరగడంతో యూసుఫ్ తన అనుచరులతో కలిసి మహిళలపై దాడి చేశాడు. వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలతో పాటు నగదు లాక్కెళ్లాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రేణుక, వెంకటయ్య, మద్దిలేటిలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం ఇబ్బందులు పడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఆర్థికంగా ఆదుకుంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లలో జాతీయ జెండాల విక్రయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పోస్టాఫీస్ కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టాఫీస్‌ల పరిధిలో ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సలేమాన్‌నగర్, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్లలో పరిధిలోని అన్ని పోస్టాఫీస్‌లలో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి జెండా రూ. 25 చొప్పున విక్రయిస్తున్నామన్నారు.

ఘనంగా కృషి ఉన్నత పాఠశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు



సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న 1999 బ్యాచ్ విద్యార్థులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండలంలోని కృషి ఉన్నత పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 1999 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ ప్రకాశ్ రావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, లలిత, కమలా, పావని, ఉపేంద్ర, విజయ్ భాస్కర్ రెడ్డి, అబ్దుల్, 1999 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు దాదాపు 50 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకున్నారు

నేడు 'హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నానక్‌రాంగూడలో 'హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, ట్రిపుల్‌ఐటీ కూడలి, అపర్ణాసైరన్ పార్కు, మసీదుబండ మీదుగా భిక్షపతి నిలయం వరకు సాగుతుందన్నారు. బీజేపీ శ్రేణులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు వీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మహా కుంభాభిషేకం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆదర్శనగర్‌లో వెలిసిన విజయదుర్గాభవాని అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని కోరుకున్నామన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను స్థానికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, పలువురు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ 212 మంది మందుబాబులు

రాయదుర్గం: మద్యం తాగి వాహనాలు నడిపిన 212 మంది పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైబరాబాద్ పరిధిలో వీకెండ్స్‌లో చేపట్టిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో 165 ద్విచక్ర వాహనాలు, 10 మూడు చక్రాల వాహనాలు, 34 నాలుగు చక్రాల వాహనాలు, 3 భారీ వాహనాల డ్రైవర్లు పట్టుబడ్డారని వీరందరిని హెచ్‌బీఎల్ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

నాగరిక వికాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: నాగరిక వికాస్ కేంద్రం (రహనుమా సెంటర్)ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. శేరిలింగంపల్లిలోని బాపూనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నాగరిక వికాస కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందనే ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవలను కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సెంటర్‌లో టైలరింగ్, కంప్యూటర్ తరగతుల వంటి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల కోసం దశలవారీగా సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ కార్యదర్శి ఇక్బాల్ హుస్సేన్ తెలుగు రైటర్ అబ్దుల్ రషీద్, నగర అధ్యక్షుడు ముబాషీర్ అహ్మద్, నిర్వాహికులు, లింగంపల్లి వకీల్ ఆహ్మద్, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

'హెచ్‌సీయూ'లో పూర్వ విద్యార్థుల సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్వర్ణోత్సవ ఏడాదిలో సిల్వర్ జూబ్లీ రీయూనియన్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. 'సెలబ్రేషన్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్' పేరిట ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో 25 ఏళ్ల క్రితం నాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్(ఎస్‌సీఐఎస్)లోని ఎంటెక్ 1998–99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం క్యాంపస్‌లో అడుగిడి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అంతేకాక ఎస్‌సీఐఎస్ ప్రొఫెసర్ల ప్రసంగాలు, నెట్ వర్కింగ్ అవకాశాలపై చర్చలు, పూర్వ విద్యార్థుల తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నాటి ప్రొఫెసర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దేబాషిష్ ఆచార్య, కె. సాయి జవహర్, మాజీ ప్రొఫెసర్లు అరుణ్ కె పూజారి, ప్రొఫెసర్ హృషికేష్ మొహంతి, చక్రవర్తిభగవతి, కెఎన్‌మూర్తి, ఎస్‌కేఉద్గత, సల్మాన్, పూర్వ విద్యార్థులు, సూర్యానారాయణమూర్తి, ఢిల్లీబాబు, ఉపేంద్రప్రాటూరి, ఎన్ వెంకటేష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో కోట బోనాలు విజయవంతం



శ్రీనివాసరాజ్‌ను సన్మానిస్తున్న రాజు వస్తాద్ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు అందరి సహకారంతో విజయవంతమయ్యాయని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ ఛైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. ఆదివారం జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఇ.శ్రీనివాసరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఏర్పాట్లలో శ్రీనివాసరాజు సమర్థవంతంగా పనిచేశారన్నారు. బోనాలు విజయవంతంగా జరగడంలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, స్థానిక హిందూ ముస్లింల సోదరులతో పాటు అమ్మవారి వృత్తిపనివారి సంఘం వారి పాత్ర ఎంతగానో ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వణాధికారి వృత్తిపనివారికి గౌరవ వేతనంతో పాటు అమ్మవారి ఒడి బియ్యం, చీరలు పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి వృత్తిపనివారి సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా టి.శివశంకర్, ఉపాధ్యక్షుడిగా బొమ్మల శ్రీకాంత్‌చారి ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని ఎస్.రాజువస్తాద్ తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌రాజ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సత్యం రెడ్డి, నాగన్న, బి.సాయిబాబాచారి, శ్రీకాంత్‌చారి ఉన్నారు.